విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

మంగళవారం 03 జూన్ 2025 8 పేజీలు

హామీలు నెరవేర్చాలి

పేదలకు ఇంటి స్థలాలు వెంటనే ఇవ్వాలి : ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం ఇస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్ తదితరులు

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మంగళగిరి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద పేద ప్రజలకు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు కాకుండా రూ.5 లక్షలు ఇవ్వాలని లబ్ధిదారులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలను నిరుపయోగమైన నివాసయోగ్యం కానీ ప్రాంతాలలో ఇచ్చి ప్రజలను మోసం చేశారని, అందుకే గత ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపారని అన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ప్రతి హామీని అమలు చేయాలని ముప్పాళ్ల అన్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలో అన్ని రెవిన్యూ, మున్సిపల్ కార్యాలయాలలో నిరుపేద ప్రజల ఇళ్ల స్థలాల కోసం అర్జీలు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. అర్జీలను పరిశీలించి వెంటనే భూసేకరణ చేసి స్థలాలు ఇవ్వాలని, పేదలకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. పేద ప్రజలకు ఆయన మాట నిలబెట్టుకోలేని వ్యక్తిగా మిగిలిపోతారని అలా కాకూడదనే దాని అమలు జరపాలని సీపీఐగా కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరకాలం గడుస్తున్న తరుణంలో ఈ నెల 12వ తేదీన ప్రథమ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా హామీలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని -మిగతా 2లో ...

వినుకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

ఉద్యమం ఉధృతం

ప్రజలకు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలి

సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

వినతి పత్రం ఇస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు

పేదల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ: కూటమి ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితం అయ్యిందని, ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంతో పూర్తిగా విఫలం చెందిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు విమర్శించారు. హామీలను -మిగతా 2లో ...

విజయవాడ సత్యనారాయణపురంలో పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత మెయిన్‌లో...

ఎమ్మెల్సీ ఆలపాటి అక్రమాలు

- శాతవాహన స్థలాన్ని కాజేసేందుకు కుట్రలు
- ప్రిన్సిపాల్‌ను కిడ్నాప్ చేసి బెదిరించిన వైనం
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజాను బర్తరఫ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: నగరం నడిబొడ్డున కోట్లాది రూపాయిలు విలువచేసే శాతవాహన కళాశాల స్థలాన్ని కాజేసేందుకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజా కుట్రలకు పాల్పడుతున్నాడని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, -మిగతా 2లో ...

సబ్సిడీపై వరి విత్తనాలు ఇవ్వండి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీని కోరిన రైతులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : వరినారుమడులు పోసే సమయం వచ్చిందని వరి విత్తనాలు ప్రభుత్వం ద్వారా పూర్తి సబ్సిడీపై రైతులకు అందించే ఏర్పాటు చేయాలని మోపర్రు గ్రామస్తులు కలెక్టర్, ఎమ్మెల్యేలకు సోమవారం వివరించారు. మండల శివారు మోపర్రు గ్రామానికి చెందిన రైతులు గత సంవత్సరం బుడమేరు, వన్నేరు పైనుండి వచ్చే వరద నీరు గట్టులు తెగి పొలాలు ఇళ్లల్లోకి వరద నీరు రావడంతో వరిపంట పూర్తిస్థాయిలో నీట మునిగి ఎలుక తినటానికి కూడా ఒక వరిగింజ పండించలేని పరిస్థితులు వచ్చేయని కలెక్టర్, ఎమ్మెల్యేతో రైతులు అన్నారు. పశువులకు వరిగడ్డి ఒక కట్ట కూడా పొలాలలో లేకపోవడంతో ఎక్కువ ధనం హెచ్చించి బయటినుంచి వరిగడ్డిని కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని కలెక్టర్‌కు వివరించారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, ఎంపీడీవో మల్లీశ్వరి, ఎమ్మార్వో రంగారావు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు రమేష్ చౌదరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఉజ్జినేని చంద్రశేఖర్ రావు (బుజ్జి), పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

హామీలు నెరవేర్చాలి

కోరారు. సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని అన్నారు. పథకాలలో గ్యాస్ ఇచ్చారని, యువకులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారని, దాన్ని మొదలుపెట్టలేదని, పాఠశాల పిల్లలకి రూ.15 వేలు అన్నారని, దానికి డేట్ ఇచ్చారని, అదేవిధంగా ఈ సంవత్సర కాలంలో హామీలను అమలు చేసి వాటితో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో కొండ పోరంబోకు, వాగు పోరంబోకు, గ్రామాలలోని ఆయా ప్రాంతాలలో చెరువుల్లో ఇల్లు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలను ఇవ్వాలని ముప్పాళ్ల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్‌ను కోరారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని ఆయన అన్నారు. ముందుగా నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాషకు లబ్ధిదారుల నుంచి పూర్తి చేసిన అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెళ్ళ వెంకటయ్య, జవ్వాది సాంబశివరావు, వల్లభాపురం నాగేశ్వరరావు, షేక్ సుభాని, గండికోట దుర్గారావు, ఉయ్యాల సత్యనారాయణ, బత్తూరి మోహనరావు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, బాపన పల్లి శ్రీనివాసరావు, సందుపట్ల భూపతి, ఆర్దల వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై జంగాల మండిపాటు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి సంవత్సరం కావస్తున్నా అమలు జరుపకుండా ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఎన్నికల ముందు వాగ్ధానాలు చేయడం... ఎన్నికలు ముగిశాక వాటిని విస్మరించడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు తహశీల్ధార్ కార్యాలయం వద్ద అర్జీదారులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నిరుపేదలకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు జరుపమని సీపీఐగా నాలుగు నెలలుగా స్థానిక సచివాలయాలు, తహశీల్ధార్ కార్యాలయాల్లో అర్జీలు అందజేసే కార్యక్రమాన్ని చేస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, జి.లక్ష్మి, మంగా శ్రీనివాస్, సమితి సభ్యులు జంగాల చైతన్య, ఇరిగినేని వెంకటేశ్వరరావు, రాగం నాగరాజు, ఆకిటి రామచంద్రుడు, చెవుల పున్నయ్య, కూరాకుల రామ్‌ప్రసాద్, శ్రీనాధ్, పెద్దసంఖ్యలో అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది : మారుతివరప్రసాద్

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు పాతర వేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తుందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. సోమవారం వినుకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద వినుకొండ రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో అవి పూర్తిగా విఫలం చెందుతున్నాయని ఆయన అన్నారు. నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కార్మికులు, శ్రామికులు, రైతులు, బడుగు జీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం వారి హక్కుల కోసం పోరాడుతుందని ఆయన అన్నారు. ధర్నా అనంతరం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ మస్తాన్, జల్లి వెంకటేశ్వర్లు, తిరుమల శ్రీను, తిరుమల నాగరాజు, తిరుమల వెంకయ్యమ్మ, సుబ్బమ్మ, లక్ష్మమ్మ, దేవమ్మ, లక్ష్మీబాయి, దేవిలిభాయ్ తదితరులు వందల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఆలపాటి అక్రమాలు

ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో శాతవాహన కళాశాల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలపాటి ఆగడాలను అరికట్టాలి, కళాశాల స్థలాన్ని కాపాడాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం గుజ్జుల వలరాజు మాట్లాడుతూ ఎంతోమందికి విద్యనందించి వారి ఉన్నతికి దోహదపడిన కళాశాలను నిర్వీర్యం చేసేందుకు ఆలపాటి రాజా పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. ప్రిన్సిపాల్ కిడ్నాప్ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇటువంటి భూ కబ్జాదారులకు ప్రభుత్వం కొమ్ముకాస్తే చూస్తు ఉరుకోమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర ఉపాధ్యక్షులు ఇజ్జాడ లక్ష్మీ, జి కుమారి, ఎన్ భాగ్యలక్ష్మీ, కే పద్మావతి, కాంతం, ఎఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కే భార్గవ్, పి నరేష్, జి షైనీ, మమత, ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీష్, కోశాధికారి సురేష్, నాయకులు దీపక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌కు పాల్పడిన ఆలపాటి రాజాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

జి కోటేశ్వరరావు, దోనేపూడి కాశీనాద్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలో 5,6 దశాబ్దాల చరిత్ర కలిగిన శాతవాహన కళాశాలతో పాటు, దాని సొసైటీ భూమి మొత్తాన్ని కబ్జా చేసేందుకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును కిడ్నాప్ చేయడంతో పాటు, తాము చెప్పినట్లు చేయకపోతే చంపుతామని బెదిరించి, కోర్టు దిక్కరణకు పాల్పడిన టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఒక బాధ్యతాయుతమైన స్థానంలో ఉండాల్సిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సభ్య సమాజం తలదించుకునే చర్యకు పాల్పడ్డాడని, దీనికి కూటమి ప్రభుత్వం, సి.ఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. శాతవాహన కళాశాల సొసైటీ భూమిని మొత్తాన్ని కబ్జా చేసేందుకు స్వయంగా ఆలపాటి రాజా రంగంలోకి దిగి తన అచరుల ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును కిడ్నాప్ చేయించాడని మండిపడ్డారు. విజయవాడ నగరంలో ఇటీవల కాలంలో ఇటువంటి సంస్కృతి లేదని, కానీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాత్రం ఏకంగా ప్రిన్సిపాల్‌నే కిడ్నాప్ చేయించి, మరలా కిడ్నాప్‌ల పర్వానికి తెరలేపాడని విమర్శించారు. కళాశాల వ్యవహారం కోర్టులో నడుస్తుండగానే ప్రిన్సిపాల్ కిడ్నాప్ కోర్టుదిక్కరణ కిందకు వస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్క వీరభద్రరావు, సీపీఎం సెంట్రల్, తూర్పు సిటీ కమిటీల కార్యదర్శులు భూపతి రమణారావు, పి కృష్ణ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్ బాలాజీ

విశాలాంధ్ర-గుడివాడ : ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ అన్నారు. సోమవారం యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో వివిధ అసోసియేషన్లు, బ్యాంకర్లు, సహకార సంస్థలు, యోగా ఔత్సాహికులు సుమారు 7 వేల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక శాసనసభ్యులు వెనిగండ్ల రాము, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, తదితరులు పాల్గొని ప్రజలతో పాటు యోగాసనాలు వేశారు.

హామీలు విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేటలో నిరుపేదలు ఇచ్చిన అర్జీ పత్రాలను ఆయన పూర్తి చేశారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయిస్తున్నామని కేబినేట్ ఆమోదించి నెలలు గడుస్తున్న నేటికి అమలకు నోచుకోలేదని దుయ్యపట్టారు. పేద ప్రజలు ఇళ్లు లేక పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. గ్రామల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తామని ప్రగల్భాలతో అధికారం చేపట్టి సంవత్సరం అయినా ఎటువంటి కార్యచరణ లేకపోవడం పేదలను అన్యాయం చేయడమేనని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే పేదల పక్షంగా సీపీఐ పోరాటం చేస్తుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ బాషా ,హకీం బేగ్ , బాబు భాష ,మహిళా సమాఖ్య నాయకులు దిల్షాద్ బేగం, షేక్ కుర్షిదా, పఠాన్ మస్తాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లపల్లిలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ పి.రమేష్బాబులు తెలిపారు. సీఐఐ మోడల్ కెరీర్ సెంటర్ విజయవాడ వారి నిర్వహణలో జరిగే ఈ జాబ్ డ్రైవ్లో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారనీ, టెన్త్, ఇంటర్, డిప్లమా, ఐటీఐ, డిగ్రీ, బి.టెక్, ఫార్మా చదివిన యువతీయువకులు పాల్గొనవచ్చన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి : కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రతి సమస్య ముఖ్యమైనదేనని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ప్రతివారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు జోనల్ కార్యాలయాల్లో ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రతి సమస్య ముఖ్యమైనదేనని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ప్రతివారం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చిట్టి నగర్‌లోని సర్కిల్-1 కార్యాలయంలో నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను పరిరక్షించారు. గతవారం జరిగిన ప్రజాప్రతిల పరిష్కార వేదిక నివేదికలో అధికారులు పరిష్కరించిన దరఖాస్తులను పరిశీలించారు. డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేఖ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

వీఎంసిలో పదవి విరమణ చేసిన సిబ్బందికి ఘన సన్మానం

వీఎంసిలో సుదీర్ఘ కాలం పనిచేసి పదవి విరమణ చేసిన సిబ్బందిని సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ధ్యానచంద్ర ఛాంబర్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో వివిధ పదవుల్లో నిబద్ధతతో ఎస్టేట్ విభాగంలో సూపరింటెండెంట్‌గా సేవలందించిన గంటా మేరీ ప్రశాంతి, శానిటరీ విభాగంలో సూపర్వైజర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రెబగొండ్ల ఓబెశ్వరరావును, ఇంజనీరింగ్ విభాగం పని చేసిన జేటిఓ శర్మను, అకౌంట్స్ విభాగంలో పని చేసిన ఆఫీస్ సబార్డినేట్ ధనలక్ష్మిని, ఎస్టేట్ విభాగంలతో సేవలందించిన శ్రీనివాస్ ఆయా విభాగాల్లో ఎనలేని సేవలందించారన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది ఎల్లప్పుడూ సహాయంగా ఉండి, రిటైర్ అయిన ఉద్యోగులపై కృతజ్ఞతా భావంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని తహశీల్దారు కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించాలని పిలుపు నిచ్చింది. ఈ క్రమంలో సోమవారం విజయవాడరూరల్ మండల సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇస్తామన్న హామీని మసిబూసి మారేడుకాయ చేశారని ఎద్దేవా చేశారు. ఈ సమస్యపై సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు గత 7, 8 మాసాలుగా అర్హులైన పేదలతో వ్యక్తిగత దరఖాస్తులు పెట్టించడం, సంబంధిత అధికారులను స్వయంగా కలిసి విన్నవించి వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వానికి చలనం లేకపోవడం చోశనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు, సూపర్‌సిక్స్ హామీలు అమలుకు తక్షణమే పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, పార్టీ రూరల్ మండల కార్యదర్శి ఉప్పెన నరసింహరావు, వియస్‌యస్ ఛైర్‌పర్సన్ కె లక్ష్మయ్య, లావూరి తీర్పి, యు వెంకటరత్నం, హూనా, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పలు మండల కార్యాలయల వద్ద ధర్నాలు....

ఇళ్ళ స్థలాలు అమలుపై మైలవరం, జి కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం తదితర మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టి రెవిన్యూ అధికారికి వినతిపత్రాలు సమర్పించారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ పాల్గొని మాట్లాడుతూ వాగ్ధానాలతో గద్దెనెక్కి కూటమి ప్రభుత్వం అధికారం చేజిక్కించుకున్న చోడి మల్లన్నలా ప్రజల గోడు పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమాఖ్య నాయకులు ధనేకుల పుల్లారావు, షేక్ జిలానీ, పి నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌బి, పి లక్ష్మీ ప్రసన్న, బి లక్ష్మీ, యస్‌కె సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పేద వైశ్య బాలుడికి వాసవి క్లబ్ సాయం

విశాలాంధ్ర-విజయవాడ: పేద బాలుడైన కట్టమూరి నాగ చైతన్య ఊపిరితిత్తుల సమస్యతో సింగనగర్ లోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చేరాడు. వివరాలు తీసుకొని క్లబ్ సభ్యులను కలసి వాసవిక్లబ్ అజిత్ సింగ్‌నగర్ అధ్యక్షుడు కె భాస్కరరావు తెలిపారు. సోమవారం నాగ చైతన్య ఇంటికి వెళ్లి వైద్య ఖర్చులు నిమిత్తం రూ.13 వేలు నగదు తల్లిదండ్రులకు సాయం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్లబ్ జెడ్ సి సురేష్ కూడా ఆ బాలుడికి రూ 2వేలు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కె.వి సుబ్బారావు, కేవీ హనుమంతరావు, సింహాద్రి గోపి,సిహెచ్ శ్రీను,కొల్లిమల్లి పెండాల మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేస్తా : జేసీ

జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఇలక్కియ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-విజయవాడ: కీలకమైన ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు చాలా ఆనందంగా ఉందని, జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులతో కలిసి కృషిచేస్తానని నూతన జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జేసీ ఛాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇలక్కియ మాట్లాడుతూ శూన్య పేదరికంతో పాటు స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించనున్నట్లు తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. గతంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసినట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. నూతన జాయింట్ కలెక్టర్‌కు విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీఎస్‌వో ఎ.పాపారావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే చొరవతో డ్రైనేజీ సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక 30 వార్డు ధనియాల పేట కొత్త కాలనీలో గత నెలలో వర్షం పడినప్పుడు కచ్చాయ్ డ్రైనేజీ లేకపోవడం వల్ల వర్షం నీరు ఇళ్లల్లోకి వెళుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ సమస్యను పరిష్కరించారని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు తెలిపారు. సోమవారం 30వ వార్డులో మిషన్ పంపించి కచ్చాయ్ డ్రైనేజీ ఏర్పాటు చేయడం జరిగింది. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే రాము వార్డు ప్రజలు కతజ్ఞాతలు తెలిపారు.

జీవన శ్రేయస్సుకు యోగా

విజయవంతంగా పారిశుద్ధ్య కార్మికుల థీమ్ యోగా.. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: మెరుగైన జీవన నాణ్యత, శ్రేయస్సుకు ఉపయోగపడే యోగా అభ్యసనానికి రోజులో తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. యోగాంధ్ర-2025 మాసోత్సవాల సందర్భంగా సోమవారం విజయవాడలోని బీఆర్‌టీఎస్ యోగాస్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల 'థీమ్ యోగా' జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్, వీయంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, వివిధ శాఖల అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిపుణుల సాయంతో రూపొందించిన 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్‌లో చాలా సరళమైన ఆసనాలు ఉన్నాయని.. వీటిని చాలా తేలిగ్గా ప్రాక్టీస్ చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఆయుష్ అధికారులు డా. వి.రాణి, డా. రామత్లేహి, డా. రత్నప్రియదర్శిని, యోగా ట్రైనర్లు సత్యనారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వర్షం నీరు నిలవకూడదు : కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : వర్షపు నీటి నిల్వలు రోడ్డుపై నిలువ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ సోమవారం వన్‌టౌన్ కృష్ణవేణి క్లాత్ మార్కెట్ ఔట్ఫాల్ డ్రెయిన్, ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లోని అన్న క్యాంటీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కురుస్తున్న వర్షాలకు నీరు రోడ్లపై నిలువకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో ఎలాంటి వ్యర్థాలున్నా త్వరితగతిని తొలగించాలని, డీసిల్టింగ్ ప్రక్రియను నిరంతరం చేస్తుండాలన్నారు. ఈ పర్యటనలో సీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్‌ఈ సత్యనారాయణ, ఈఈ సురేఖ, డిప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, యూసీపీ పీవో వెంకటనారాయణ పాల్గొన్నారు.

రేషన్ షాపులు ప్రారంభం

విశాలాంధ్ర-గన్నవరం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్ర వ్యాప్తంగా రేషన్‌షాపుల ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం గన్నవరం పట్టణంలోని 115, 117, రేషన్ షాపులు కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో ఘనంగా ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాస్తి శ్రీధర్, కాసన్నేని రంగబాబు, పడమట రంగారావు, కొమ్మరాజు సుధీర్, మోదుగుమూడి వేణు, మద్దినేని వెంకటేశ్వరరావు, చిమట శ్రీనివాసరావు, మోర్ల నాగబాబు, జాస్తి మురళి, తంగిరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెమలి దేవస్థానంలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-గంపలగూడెం : నెమలి హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం మండలంలోని నెమలిలో శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో నిర్వ హించారు. మార్చి 23వ తేదీ నుంచి నేటి వరకు స్వామివారికి భక్తులు 15 లక్షల 93 వేల 44 రూపాయలు కానుకలుగా సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వాహణాధికారి సి. జయప్రకాష్ బాబు, గన్నవరం ఇన్‌స్పెక్టర్ కే .అనురాధ, దేవస్థానం మాజీ చైర్మన్ బెల్లం. మధుసూదన్ రావు, గ్రామానికి చెందిన వనమా. చిన్న అనంతరామయ్య, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ ప్రమాణ స్వీకారం

'సుపరిపాలన మొదలై ఏడాది' బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి, ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేసిన ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, పాలకవర్గం

విశాలాంధ్ర-ఘంటసాల/ చల్లపల్లి: ఘంటసాల మండలం కొడాలిలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్ పర్సన్ తోట కనకదుర్గ ప్రమాణ స్వీకార సభ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మనోహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ.1,674 కోట్లు బకాయిలు ఎగ్గొట్టి, రాష్ట్రాన్ని పది లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసిందన్నారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వైస్ చైర్మన్ అత్తలూరి గోపీచంద్, ఏఎంసీ డైరెక్టర్లు నాదెళ్ల వెంకట నరసయ్య, సూదాని నందగోపాల్, కోన రాజశేఖర్, అంకాని మహేంద్ర, చుండూరు రామ కోటేశ్వరరావు, గుత్తి ధనలక్ష్మి, జంజనం కోటేశ్వరమ్మ, కొక్కిలిగడ్డ సరళ కుమారి, కోలపల్లి శ్రీవర్ష, కొమరగిరి నాగిని, కుక్కల కృష్ణకుమారి, ఎం.ప్రసాద్, షేక్ ఇబ్రహీంలతో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిషోర్, ఏఎంసీ కార్యదర్శి బండారు హేమ సుందరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ చిరువోలు బుచ్చిరాజు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చల్లపల్లిలో కూటమి నేతల కోలాహలం

ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, డైరెక్టర్లప్రమాణస్వీకారానికి చల్లపల్లి నుంచీ కూటమి నేతలు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన నేతలు, కార్యకర్తలు చల్లపల్లి తరలిరాగా, టీడీపీ, బీజేపీ నేతలు వారికి జతకలిశారు. ఆరుమండలాల ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు చల్లపల్లిలోని జనసేన కార్యాలయం వద్ద నుంచీ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్, కూటమి నేతలతో కలిసి ఏఎంసీ చైర్మన్ ఊరేగింపుగా కొడాలి వెళ్లారు. జనసైనికులు ర్యాలీపై పూలవర్షం కురిపించారు. అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, శీలం అశ్విన్కుమార్, నేతలు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వన్యనుకరణ సమారోహ

విశాలాంధ్ర-విజయవాడ: నవ్వడం ఒక భోగం. నవ్వించడం ఒక యోగం. నవ్వకపోవడం ఒక రోగం. సరిగ్గా ఈ మాటను నిజం చేస్తూ ప్రజలను నవ్వించాలని, ఆనందం పంచాలనీ ఏర్పాటు చేసిన ధ్వన్యనుకరణ్ సమారోహ మిమిక్రీ ఉత్సవం (నవ్వుల పండుగ) విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన మిమిక్రీ కళాకారులు ఆహుతులను కడుపుబ్బా నవ్వించారు. మిమిక్రీ రంగంలో 4 దశాబ్దాలుగా నిష్ణాతులైన సీనియర్ మిమిక్రీ కళాకారుడు ధ్వన్యనుకరణ చక్రవర్తి కళారత్న శ్రీ భవిరిరవికి సన్మానం చేశారు. ఈ సభకు ఎమ్మెల్యే ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ ఎ.పి బి.సి.వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి శ్రీరాము సత్యనారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య త్రిమూర్తుల గౌరీ శంకర్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా న్యూరోసర్జన్ నిపుణులు డాక్టర్ వజ్రాల శివకుమార్, కళారత్న శ్రీ సిల్వెస్టర్, ప్రొఫెసర్ డాక్టర్ తియ్యబిండి కామేశ్వరరావు, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీ జి.వి. ఆర్.శేఖర్‌గా విచ్చేశారు. ఏఐఐఎంఏ వ్యవస్థాపక అధ్య క్షులు జి.వి.ఎన్.రాజు స్వాగతోపన్యాసం చేశారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నాగాయలంక రత్నం భవిరి రవి తాను ఎంచుకున్న రంగంలో అంచెలంచెలుగా శిఖర స్థాయికి చేరాడనీ, మిమిక్రీ కళాకారులకు ఎన్నో అవార్డులు రావాలని, రవి చేసిన కృషికి పద్మశ్రీ అవార్డు రావాలని అభిలషించారు. శిల్పకళా భారతి పక్షాన కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య రచించిన వేదాల్లో శిల్పాచార్య పరంపరను తెలిపే'ఆదివిజ్ఞానులు' గ్రంథాన్ని ఆవిష్కరించారు. భవిరిరవి తన ఉన్నతికి తోడ్పడ్డ ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. శిల్పకళాభారతి అధ్యక్షులు కందుకూరి వెంకట సత్యబ్రహ్మాచార్య వందనసమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర-ఏ కొండూరు: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి వాగ్దానాలు ఇచ్చి నేటికీ హామీలను నెరవేర్చలేదని వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు మేకల డేవిడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం వ్యక్తిగత అర్జీలతో ఏ కొండూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి, అనంతరం తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు అర్జీలు సమర్పించారు. డేవిడ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో సెంటున్నర పట్టణాల్లో సెంటు ఇంటి నివేసిన స్థలం మంజూరు చేయగా ఆనాడు సీపీఐ ఆధ్వర్యంలో గ్రామాల్లో 3 సెంట్లు పట్టణంలో 2 సెంట్లు ఇంటి నివేశన స్థలం ఇవ్వాలని పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణంలో రెండు సెంట్లు ఇస్తానని ఆ దిశగా జీవోను కూడా తెచ్చి మర్చిపోయిందని, నేటికి 10 నెలలు కావస్తున్న ఆ ఊసే మరిశారని ఆయన తెలిపారు. తక్షణమే గ్రామాల్లో 3 సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి ముచ్చింతల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రారంభించిన ఈ పోరాటం ఇంటి నివేశన స్థలం లేని ప్రతి పేదవానికి స్థలం ఇచ్చే వరకు ఉంటుందని సమిష్టిగా ఈ పోరాటాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ, మండల కమిటీ సభ్యులు తెల్లూరి సంగీతరావు,నగ్గుర్తి కుమారి,కోల లక్ష్మీకాంతమ్మ, కొడవటి ఏసుపాదం, కొలికపోగు కృష్ణ, పరస పుల్లయ్య, ముచ్చింతల మహేష్, దయ్యాల దేవదాసు, భూక్య చిట్టెమ్మ,డి సుజిని,బి లక్ష్మి, అడ్డకట్ల కృష్ణవేణి,ఎం శ్రీను, మణికంఠ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-గంపలగూడెం : స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో పేదలకుమూడు సెంట్లు స్థలం, పట్టణాల్లో రెండు సెంట్లు నివేసనా స్థలాలను వెంటనే అందజేయాలని సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని స్థానిక తహసిల్దార్ రాజకుమా రికి అందజేశారు .ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్. నాగుల్ మీర, గంపలగూడెం మండల కార్యదర్శి గౌర్రాజు. రామకృష్ణ , తోటమూల శాఖ కార్యదర్శి షేక్. కరీముల్లా, మండల సహాయ కార్యదర్శి సిద్ది .కొండలరావు ,ఎడ్లపల్లి. కృష్ణ , వెల్పుల, గోపయ్య,కోట. రమాదేవి, మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఇళ్ల స్థలాలు లేని పేదవారు, ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేశారు.

రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట-ఎ.కొండూరు మార్గం నుంచి ఆకుల వారి వీధిలోకి వెళ్లే రహదారిని ఆక్రమించి, ఆ ప్రాంత వాసులను ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తులపై తక్షణం చర్యలు తీసుకోవాలని సీపీఐ విస్సన్నపేట మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు డిమాండ్ చేశారు. ఈ వీధి ఆరంభంలో ప్రధాన రహదారి మార్జిన్లో స్థలం రేటు పెరిగిందనే దురుద్దేశంతో వీధిలో ప్రజలు నడిచే పంచాయతీ రహదారిని ఆక్రమించి, రాకపోకలు నిలిపివేయటమే కాక, ర.భ.శాఖ మార్జిన్లో షెడ్లు నిర్మించి వ్యాపారులకు అద్దెకు ఇవ్వటం దారుణమన్నారు. న్యాయస్థానం సూచనలు సైతం ఇక్కడ బేఖాతరు చేస్తూ ఆటవిక న్యాయానికి తెర లేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆక్రమణలకు పాల్పడిన వారిపై అధికారులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని, ఈ వీధిలో నివసిస్తున్న ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు.

చినముత్తేవి పీఏసీఎస్ పునః ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలో పెదముత్తేవి, కొండవరం, చినముత్తేవి గ్రామాలకు కలిపి ఉన్న చినముత్తేవి కోఆపరేటివ్ సొసైటీలో రికవరీ సరిగ్గా లేనందున రెండు సంవత్సరాల నుండి రైతులకు రుణాలు మంజూరు కాక సొసైటీ మూతపడి పక్కసొసైటిలకు విలీనం అయ్యే పరిస్థితిలో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు కృష్ణా కోఆపరేటివ్.బ్యాంకు సి.ఈ.ఓ. తో మాట్లాడి సోమవారం మొదటి రైతు నేస్తం లోను రైతుకు అందించి మళ్లీ బ్యాంకును పునఃప్రారంభించారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర-మచిలీపట్నం : అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు వెంటనే మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, సీపీఐ నాయకురాలు దేవా భక్తుల నిర్మల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణంలో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు అందచేయాలని వారు కోరారు. అనంతరం కార్యాలయం సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కే గగన్, మహిళా సమైక్య నాయకురాలు ఓడుగు రత్నకుమారి, సీపీఐ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు, నీలం దేవి కల, ఇంద్ర కుమారి పాల్గొన్నారు.

వెలిగట్ల ప్రసాద్‌కు మాతృవియోగం

విశాలాంధ్ర-పెడన : పెడన పట్టణ 13 వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వెల్లి కట్ల ప్రసాద్ తల్లి వెలికట్ల కమల అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడిగా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు విశేషంగా కృషి చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు ను చల్లపల్లి మండలం మాజేరు గ్రామతెలుగుదేశం నేతలు ఘనంగా సత్కరించారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కనపర్తిని మర్యాదపూర్వకంగా కలసిన మాజేరు తెలుగుదేశం నేతలు స్థానిక ప్రజా సమస్యలు వివరించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మట్టా నర్సయ్య, చిల్లిముంత శ్రీనివాసరావు,యార్లగడ్డ శేష, మోతుకూరి అంకలరావు,ఒగ్గు కోటయ్య,కాకర్ల దుర్గా నాగేశ్వరరావు,శొంటి శివయ్య,యార్లగడ్డ రుక్మనేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

దగా డీఎస్సీ పై ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ, (గాంధీనగర్) : డీఎస్సీఅభ్యర్థుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తాము అండగా ఉంటామని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ తెలిపారు.సోమవారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో దగా డిఎస్సి పై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందన్నారు. ధర్నా చౌక్ నుంచి కాలినడకన బయలుదేరి డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో పలువురు నాయకులు,డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

ముగిసిన మున్సిపల్ చైర్ పర్సన్ ఉప ఎన్నిక

విశాలాంధ్ర-తిరువూరు: మున్సిపల్ చైర్పర్సన్ ఉప ఎన్నిక సోమవారం ప్రశాంతగా సోమవారం నగర మున్సిపల్ కార్యాలయంలోని ఎలక్షన్ ఇంచార్జ్ ఆర్డిఓ కే.మాధురి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. టీడీపీ బలపర్చిన 1వ వార్డు కౌన్సిలర్ కొలికపోగు నిర్మల వైసీపీ అభ్యర్థిపై రెండు ఓట్లతో గెలుపొందారు. ప్రారంభమైన చైర్పర్సన్ ఉప ఎన్నికల ప్రక్రియలో టీడీపీ బలపర్చిన అభ్యర్థినిగా కొలికపోగు నిర్మల అభ్యర్థిత్వాన్ని 11వ, వార్డు కౌన్సిలర్ కాకర్లమూడి సుందర కుమార్ ప్రతిపాదించగా, 14వ వార్డు కౌన్సిలర్ పసుపులేటి శేఖర్ బాబు బలపరిచారు. వైసీపీ అభ్యర్థిగా మోదుగు ప్రసాదు అభ్యర్థిత్వాన్ని 10వ వార్డు కౌన్సిలర్ తంగిరాల వెంకటరెడ్డి ప్రతిపాదించగా, 7వ వార్డు కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు (బీరువాలబాబు) బలపరిచారు. ఉప ఎన్నికలకు ఎడిసియో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో పాటుగా టీడీపీ బలపర్చిన అభ్యర్థులు 11 మంది, వైసీపీ సభ్యులు 9 మంది హాజరయ్యారు. ఈ ఎన్నికలో నిర్మలకు పది మంది కౌన్సిలర్లు చెయ్యెత్తి మద్దతు, తెలపడంతో ఆమె గెలిచినట్లు ప్రకటించిన ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ప్రకటించడంతో పాటు, ఆమెతో పదవీ ప్రమాణం చేయించారు. ఎన్నికల పరిశీలకుడు డిఆర్ నరసింహారావు, మున్సిపల్ కమీషనర్ జి.లోవరాజులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ శ్రీ మండవ జానకి రామయ్యజానకి రామయ్య సులోచన క్షేత్రయ్య కళ్యాణ మండపంలో మే 27వ నుంచి నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యోగా గురువు లను మువ్వ మండల ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు

యోగా గురువులను సన్మానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న యోగా దినోత్సవంలో భాగంగా శిక్షణ ఇచ్చిన గురువులు బోలెంవెంకటనాగ శివ (పిడి.పెదసనగల్లు హైస్కూల్) పి. నాగబసవయ్య (పిడి కాజ హైస్కూల్)మంతెన లీలా మోహన వర్మ (పిఈటి రియంటల్ హైస్కూల్ పెదముత్తేవి)లు ప్రతి రోజుఇంటి వద్ద చేసుకునే విధంగా వ్యాయామాలు, శ్వాస మీద ధ్యాస తదితర అంశాలపై శిక్షణను వారం రోజుల పాటు అందించిన సందర్భముగామొవ్వ మండలఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ మండల శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, సభ్యులు మద్దాల కామేశ్వర రావు, గొరిపర్తి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపటమే చంద్రన్న లక్ష్యం : సౌమ్య

విశాలాంధ్ర-నందిగామ:- పేదలకు పట్టెడు అన్నం పెట్టడమే చంద్రన్న లక్ష్యం అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఐదేళ్లుగా అన్నార్తులు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే అన్న క్యాంటీన్లు ఓపెన్ చేసి ఎందరో బడుగు బలహీన వర్గాలకు అన్న క్యాంటీన్ అండగా నిలుస్తుందని అన్నారు. సోమవారం స్థానిక రైతు బజార్‌లో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వడ్డెల్లి సాంబ శివరావు మనమరాలు పుట్టినరోజు సందర్భంగా అన్న క్యాంటీన్‌లో వారు అన్నదానం నిర్వహించారు. మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వడ్డెల్లి సాంబశివరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, స్థానిక కూటమి నేతలతో ప్రారంభించారు. అంతకుముందు దేవినేని వెంకటరమణ ఏరియా హాస్పిటల్‌లో కమిటీ చైర్మన్ ఏపూరి నాగేశ్వర రావు ఆధ్వర్యంలో ఫార్మర్ ఫౌండేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.

బారిగేట్లు బహుకరణ

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానమునకు క్యూ లైన్లుగా వినియోగించుటకు పల్నాడు జిల్లా, శావల్యాపురం మండలం, ఇర్లపాడు గ్రామస్తుడు ఆరుమళ్ళ వెంకటరావు ధర్మపతి అనూష వారి కుటుంబ సభ్యులతో కలిసి జింకు పైపులతో చేసిన లక్ష రూపాయలు విలువ చేసే 25 బారిగేట్లు దేవస్థానం ఉప కమిషనర్‌, కార్యనిర్వహణాధికారికి సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో అందించినట్లు ఆలయ ఉప కమిషనర్‌, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమార్‌ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళం సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఉప కమిషనర్‌ విజ్ఞప్తిచేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్‌ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమ బుద్ధ రోడ్డు వద్ద శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘ కార్యాలయం ఎదుట ఆ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ప్రతి సోమవారం నిర్వహించే ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో 1000 మందికి చల్లటి మజ్జిగ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పందేటి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ సేవా స్ఫూర్తితో వేసవి నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారన్నారు. గత రెండు నెలలుగా నిర్విరామంగా ప్రతిరోజు ఉచితంగా చల్లటి మినరల్‌ వాటర్‌ను కూడా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ సభ్యులు సంగలం ప్రసాద్‌, కర్నాటి శివ సత్యనారాయణ, పంచల శివన్నారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, నల్లమోలు నాగరాజు, బేతపూడి మధు, రెడ్డి వీర రాఘవులు, సంద్యాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలో సోమవారం జీబీసీ రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బి గోగినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పట్టణ పరిధిలో 2.50 కిలోమీటర్లు పనులను రూ.5కోట్లు ప్రత్యేక నిధులతో చేపట్టినట్లు డిఈ తెలిపారు. నిబంధనల ప్రకారం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.

బస్‌ షెల్టర్‌ ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-రెంటచింతల: ప్రయాణీకుల సౌకర్యార్థం రూ.2.50 లక్షలతో బస్‌ షెల్టర్‌ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎంపీడీఓ సరోజినీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యరబోతు నాగభూషణం.హైమావతి గార్ల కుమారుడు శ్రీనివాస రావు గారి జ్ఞాపకార్ధంగా ఎన్‌ఆర్‌ఐ ప్రవీణ్‌ కుమార్‌ నిర్మించిన బస్‌ షెల్టర్‌ ను ప్రయాణీకులు ఉపయోగించుకోవాలని కోరారు. మాజీ వైస్‌ ఎంపీపీ గొంటు సుమంత్‌ రెడ్డి, ఉప తహశీల్దారు బ్రహ్మం,మండల స్థాయి నాయకులు టీడీపీ మండల టౌన్‌ అధ్యక్షుడు మూలి రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, యరబోతుల నేతాజీ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎస్‌ఎఫ్‌

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్‌ : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్‌ గుంటూరు జిల్లా కార్యదర్శి బందారపు యశ్వంత్‌ రఘువీర్‌ డిమాండ్‌ చేశారు. ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా సమితి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ భార్గవ్‌ తేజకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండు శివ, బందారపు యశ్వంత్‌ మాట్లాడుతూ కొడిగుడ్ల సత్రంలో ఉన్న సమీకృత సంక్షేమ భవన్‌కు రూ.90 లక్షలు కేటాయించి, భవనంను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభమౌతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు తాగునీటి సదుపాయం, గదులలో లైట్లు, ఫ్యాన్లు, నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ట్రంకు పెట్టెలు, పుస్తకాలు, బట్టలు, దుప్పట్లు, దోమతెరలు సకాలంలో అందించాలన్నారు. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్‌ చార్జీలు, కాస్మొటిక్‌ చార్జీలు విడుదల చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా హాస్టల్లో ఖాళీగా ఉన్న వార్డెన్‌, కుక్‌, అటెండర్‌ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారానికై పెద్దఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ నగర కార్యదర్శి ప్రణీత్‌, ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి డేవిడ్‌, పవన్‌, అజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌ ఫలితాల్లో భాష్యం సంచలనం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జేఈఈ అడ్వాన్స్‌డ్‌-2025 ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్‌ భాష్యం రామకృష్ణ తెలిపారు. సోమవారం విడుదలైన ఫలితాలలో భాష్యం విద్యార్థులు ఎస్‌.వెంకటసాయి చక్రి ఓపెన్‌ కేటగిరిలో ఆలిండియా 33వ ర్యాంకు, ఎం. శ్రీకర గణేష్‌ 104వ ర్యాంకు, ఎన్‌. కాష్‌ 108వ ర్యాంకు, టి.విక్రమ్‌ లేవీ 146వ ర్యాంకు, డి.జస్వంత్‌ బాలాజీ 151వ ర్యాంకు, జి.సాయిమనోజ్ఞ 152వ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో విజయ కేతనం ఎగురవేశారన్నారు. అదేవిధంగా వివిధ కేటగిరిలలో ఎస్‌.వెంకటసాయి చక్రి ఆలిండియా 3వ ర్యాంకు, ఎన్‌.ఆకాష్‌ 11వ ర్యాంకు, కె.యశ్వంత్‌ 11వ ర్యాంకు, కె.షణ్ముఖ సాయి 15వ ర్యాంకు, టి. విక్రమ్‌ లేవీ 21వ ర్యాంకు, డి.జస్వంత్‌ బాలాజీ 22వ ర్యాంకు, పి.లక్ష్మీనారా యణ 26వ ర్యాంకు, ఎస్‌.వి. సాయిచక్రి 33వ ర్యాంకు, కె.పార్థసారథి 36వ ర్యాంకు, సి.హెచ్‌. దివ్యశ్రీ 42వ ర్యాంకు, డి. సుభాష్‌ 48వ ర్యాంకు, ఎస్‌.కె. అబ్దుర్‌ రహీమ్‌ 68వ ర్యాంకు, ఎం.సాయితేజ 77వ ర్యాంకు, జి. రాధాశ్యామ్‌ 91వ ర్యాంకు వంటి 100లోపు 14 ఆలిండియా ర్యాంకులు, 200లోపు 26 ర్యాంకులు, 500లోపు 57 ర్యాంకులు, 1000లోపు 91 ర్యాంకులు, 2000లోపు 124 ర్యాంకులు మరియు 5000లోపు 218 ఆలిండియా ర్యాంకులు సాధించడంతో పాటు ఐఐటి సెలెక్షన్స్‌ లో ఆలిండియా ఆల్‌ టైం ది బెస్ట్‌ గా నిలిచిందన్నారు. ఈ అద్భుత ఫలితాలకు పక్కా ప్రణాళికతో కూడిన మా భాష్యం ఐఐటి ఫౌండేషన్‌ కరిక్యులమే ముఖ్య కారణమన్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌ రామకృష్ణ జెఈఈ మెయిన్‌లో ఓపెన్‌ కేటగిరిలో 100 పర్సంటైల్‌తో పాటు ఆలిండియా 18వ ర్యాంకు సాధించిన జి.సాయిమనోజ్ఞకు రూ.5లక్షలు, జెఈఈ అడ్వాన్స్‌డ్‌ ఓపెన్‌ కేటగిరిలో ఆలిండియా 33వ ర్యాంకు సాధించిన ఎస్‌.వెంకట సాయిచక్రికి రూ.5 లక్షలు, శ్రీకర గణేష్‌, ఎన్‌. ఆకాష్‌లకు రూ.2 లక్షలు, టి.విక్రమ్‌ లేవీ, డి.జస్వంత్‌ బాలాజీలకు రూ. లక్ష చొప్పున ఉన్నత చదువుల నిమిత్తం నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. విద్యార్థులను చైర్మన్‌ భాష్యం రామకృష్ణ, వైస్‌ చైర్మన్‌ హను మంతరావు, మేనేజింగ్‌ డైరెక్టర్‌ భాష్యం సాకేత్‌ రామ్‌ అభినందించారు.

వ్యవసాయంలో సాంకేతికతను జోడిస్తే అద్భుత ఫలితాలు

విశాలాంధ్ర-పెదకాకాని : రైతులు ప్రస్తుత కాలం మార్కెట్‌లో ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని నివారించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేశారు. సోమవారం పెదకాకానిలోని పలువురు రైతులతో వారు మాట్లాడుతూ ప్రతి రైతు నేషనల్‌ అగ్రికల్చర్‌ మార్కెటింగ్‌ పోర్టల్‌లో తమ పేరు, ఉత్పత్తి వివరాలు నమోదు చేసుకోవాలని, ఇలా చేసుకుంటే వ్యవసాయ మార్కెట్‌లో దళారుల ప్రమేయం లేకుండా రైతులు గిట్టుబాటు ధరకు తమ ఉత్పత్తులను విక్రయించుకోవచ్చని అన్నారు. డాక్టర్‌ సౌజన్య లక్ష్మీ మాట్లాడుతూ రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సబ్సిడీ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కృత్రిమ ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి పరంగా వచ్చే ఎరువులు, పురుగు మందులు వినియోగించుకోవాలని కోరారు. పంట పొలాల అవశేషాలను పశువుల మేతగా లేదా ఎరువుగా వాడుకోవాలని, అలాకాకుండా కాల్చివేస్తే భూసారం దెబ్బతింటుందని చెప్పారు. భూసార పరీక్ష చేయించుకుని తమ భూమికి అనువైన పంటలను వేయాలని శాస్త్రవేత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ శివశంకర్‌, మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి, శివాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి కళ్ళం పానకాలరెడ్డి



విశాలాంధ్ర-తాడేపల్లి : కళ్ళం పానకాల రెడ్డి ధన్యజీవి అని ఏపీ రాష్ట్ర వ్యవసాయ మిషన్‌ వైస్‌ చైర్మన్‌ మర్రెడ్డి శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని పెనుమాక కళ్ళం రాజశేఖర్‌ రెడ్డి నివాసం ఎదుట కళ్ళం పానకాల రెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళ్ళం పానకాల రెడ్డి జీవించినంత కాలం ప్రజల మనిషిగా ఊహ తెలిసినప్పటి నుంచి వామపక్ష భావ జాలంతో ప్రజల కష్టాలు కన్నీళ్లు కడగండ్లు బాధలు అన్నిటినీ అర్థం చేసుకొని దాని విముక్తి కోసం పరిష్కారం కోసం కృషి చేశారని కొనియాడారు. టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్‌ మాట్లాడుతూ పానకాల రెడ్డి అందరికీ సుపరిచితుడని, మానవతావాది అని కొనియాడారు. కళ్ళం రాజశేఖ ర్‌ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు శివసాంబి రెడ్డి, టీడీపీ తాడేపల్లి పట్టణ మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివ రావు, కొల్లి శేషు, పఠాన్‌ జానీ ఖాన్‌, జొన్న శివశంకర్‌ రావు, దొంతి రెడ్డి వెంకట్‌ రెడ్డి, ఆకుల ఉమామహేశ్వర రావు, ఆలూరి యుగంధర్‌, కళ్ళం వేణుగోపాలరెడ్డి, భీమవరపు సురేంద్ర రెడ్డి, కొల్లి సురేష్‌, కళ్ళం గోవింద రెడ్డి, కళ్ళం చేతన్‌ రెడ్డి, బొబ్బా రవితేజ, ప్రసన్న, అక్బర్‌, నరేష్‌, అయూబ్‌, ఉయ్యూరు శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఓల్డేజ్‌ హోంకు ఇన్వర్టర్‌ బహూకరణ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్‌ : భారతదేశ బ్యాంకింగ్‌ వ్యవస్థలో ఉద్యోగులకు, అధికారులకు మొట్టమొదటిసారిగా 1986 నుంచి పెన్షన్‌ సాధించి పెట్టిన మహానాయకుడు ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి తారకేశ్వర చక్రవర్తి అని గుంటూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు కొనియాడారు. తారకేశ్వర చక్రవర్తి 100వ జయంతి సందర్భంగా గుంటూరు శ్రీనగర్‌ కాలనీ 7వ లైన్‌లో గల మాతృశ్రీ ఓల్డేజ్‌ హోంలో నిరంతర విద్యుత్‌ సదుపాయార్థం గుంటూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం తరుపున పెద్ద ఇన్వర్టర్‌ను సోమవారం బహూకరించారు. జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘ కార్యదర్శి భాషా, అధ్యక్షులు రవిచంద్రారెడ్డి, ఏపీటీబీఈఎఫ్‌ నాయకులు రామకృష్ణ, షరీఫ్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రమణి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్‌ : వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ గుంటూరు జిల్లా వైస్‌ ప్రెసిడెంట్‌ సత్తెనపల్లి రమణి జన్మదినం సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని షిరిడీ సాయి అంధుల ఆశ్రమంలో బాలబాలికలు, వృద్దులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. తొలుత చాకలి గుంట అమ్మవారి దేవాలయంలో సత్తెనపల్లి రూన్సీ ఆధ్వర్యంలో రమణి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైసీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, గుంటూరు నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, మిర్చి యార్డు మాజీ డైరెక్టర్‌ కొప్పుల విజయమాధవి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు ఆవుల సుందర్‌ రెడ్డిలు రమణికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రూన్సీ, రాజేశ్వరి, సలీమా, అన్వర్‌, రవీంద్ర పాల్గొన్నారు.

ధర్నాలో పొగాకు రైతులు పాల్గొనాలి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : బర్లీ పొగాకుకు మద్దతు ధర ప్రకటించాలని, రైతులు నష్టపోకుండా అధిక ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్లతో గుంటూరులో ఉన్న జీపీఐ కార్యాలయం వద్ద ఈ నెల 5న జరిగే ధర్నాకు పొగాకు రైతులు తరలిరావాలని గుంటూరు జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పీవీ జగన్నాథం పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు స్వాతి గౌడ్‌ సాయం



విశాలాంధ్ర-మంగళగిరి: ఏలూరుకు చెందిన కే జశ్విత తొమ్మిది సంవత్స రాల పాప అతి చిన్న వయసులోనే బ్లడ్‌ క్యాన్స రేతో పోరాడుతుందని, తల్లిదండ్రులు రోజువారి కూలీలు కావడంతో వైద్య చికిత్స నిమిత్తం సహాయం అవసరమని విజయవాడ రెయిన్బో హాస్పిటల్‌ పిల్లల క్యాన్సర్‌ వైద్య నిపుణులు డాక్టర్‌ వీణ అక్కినేని ద్వారా విజయ హెల్త్‌ కేర్‌ ట్రస్ట్‌కి సమాచారం అందజేయగా, విషయం తెలుసుకున్న ట్రస్ట్‌ ఫౌండర్‌ స్వాతి గౌడ్‌ పాప వైద్య ఖర్చుల సహాయార్థం దాతల సహాయంతో పాప తండ్రికి రూ.20వేల చెక్కు అందజేశారు.

అర్జీదారుల వద్దకే కలెక్టర్ రాక

విశాలాంధ్ర–నరసరావుపేట: సోమ వారం స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల దినోత్సవంలో భాగంగా నర్సరావుపేట 6వ వార్డు బాబాపేటకు చెందిన మండ్ల మరియమ్మ పుట్టుకతోనే రెండు చేతులు రెండు కాళ్ళు లేవు, షేక్ మస్తాన్ బీ కుమారులు, ఇస్మాయిల్, 35 సంవత్సరాలు, సుభాని 32 సంవత్సరాలు మరిగుజ్జు వాళ్ళు వారి సమస్యలను తెలుపుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలోకి వచ్చారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ పి.అరుణ్ బాబు తక్షణమే స్పందించి వారి వద్దకు వెళ్లి విషయాలను సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ప్రస్తుతం రూ.6వేలు పెన్షన్ వస్తున్నదని, రూ.10వేల పెన్షన్ కావాలని అర్జీలు ఇచ్చారని, పింఛన్ మంజూరు కాలేదని అర్జీ రూపంలో విన్నవించుకు న్నారు. దీనిపై స్పందించిన ఆయన తక్షణమే మెడికల్ బోర్డుకు సిఫార్సు చేసి అవసరమైన చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. డివిజన్ అధికారి మధులత, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బివి రవి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం: మారుతి

విశాలాంధ్ర-క్రోసూరు : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండల సీపీఐ మహాసభకు మండల పార్టీ నాయకులు పోతుగంటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను విడనాడాలని, మతసామరస్యాన్ని కాపాడాలని, మైనారిటీల రక్షణకు వారి హక్కులకు భంగం వాటిల్లే విధంగా ప్రవర్తిస్తున్న సంఘ పరివార శక్తులను కట్టడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి సొంత ఇంటి కల వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ రోజున ఇళ్లస్థలాల కోసం సీపీఐ ఇచ్చిన రాష్ట్ర పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు జరుగుతున్నాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టణాల్లో ఇచ్చిన సెంటు భూమి చాలదని, పక్కా గృహము నిర్మించుకొనుటకు ఆ ప్రభుత్వము గ్రాంట్ చేసిన రూ.1.80 లక్షలు రుణం సరిపోదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని అందులో పక్కా గృహము నిర్మించుకొనుటకు రూ.4 లక్షలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి ఉన్నారన్నారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం కావస్తున్న ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఎప్పుడు నెరవేరుస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలము రెండు సెంట్లు ఇచ్చి పక్కా గృహం నిర్మించుకొనుటకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. వయోవృద్ధులు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు అర్హులైన వారందరికీ పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని, రేషన్ కార్డులు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము తదితరులు మాట్లాడుతూ 100 సంవత్సరాల భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమం పేద ప్రజల కోసం తమ ప్రాణాలను బలి ఇచ్చిందని భూమి కోసం భుక్తి కోసం బడుగు జీవుల విముక్తి కోసం ఎన్నో పోరాటాలు ఎన్నో త్యాగాలు చేసిందని దేశ స్వాతంత్రం అనంతరం ప్రజలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిందని అన్నారు. జిల్లాలో మహాసభలు జరుగుతున్నందున అన్ని శాఖలు మండల మహాసభలు నిర్వహించుకునే కార్యక్రమంలో భాగంగా మండల మహాసభ విజయవంతంగా నిర్వహించామని వారన్నారు. అనంతరం మహాసభ మండల కమిటీని ఎన్నుకున్నారు మహాసభలో కంతేటి పెద్దబ్బాయి, ఎస్.పాండు, షేక్ బుజ్జి, ఎస్.యాదగిరి, లక్ష్మణ్, మంత్రాలు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థులకు అసాధారణ ర్యాంకులు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్డ్ 2025 ఫలితాలలో ఎస్.ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల నైపుణ్యం, కళాశాల యాజమాన్యం రూపొందించిన ప్రోగ్రాంల సమిష్టి ఫలితమే జేఈఈలో తమ విద్యార్థుల అసాధారణ ర్యాంకులకు కారణమని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని ఎస్ఆర్ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో డీజీఎం రమణ, కోర్ డీన్ అరవింద్ మాట్లాడుతూ అత్యంత నాణ్యత, విలువలతో కూడిన విద్యను సామాన్య విద్యార్థులకు అందే విధంగా చూడడం ద్వారానే ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో వివిధ కేటగిరిలలో యమ్. రవిచంద్రారెడ్డి (8వ ర్యాంకు), వి.నాగసిద్ధార్థ (13వ ర్యాంకు), పి.సాక్షి (40వ ర్యాంకు), ఎ.అనుశ్రీ (47వ ర్యాంకు), భానావత్ సాయి (68వ ర్యాంకు), వై.భరణి శంకర్ (90వ ర్యాంకు) సాధించారని చెప్పారు. టి.తేజస్ ఉద్భవరెడ్డి గుంటూరు బ్రాంచి నుండి ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 662వ ర్యాంకు సాధించాడని చెప్పారు. మంచి ఫలితాలు సాధించి ఎస్.ఆర్ విద్యాసంస్థల ప్రతిష్టను పెంచిన విద్యార్థులను, అధ్యాపకులను డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, సీఈవో సురేందర్ రెడ్డి, జీఎం రాజేంద్రప్రసాద్, డీజీఎం గోవర్ధనరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి పూర్ణ చంద్రరావు, డీన్లు అప్పిరెడ్డి, అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ సురేష్, ఉదయ్ పాల్గొని విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు



విశాలాంధ్ర-దుర్గి: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు గ్రంథాలయ అధికారి పి వేణుగోపి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం వ్రాయడం,కథలు పుస్తకాలు చదవడం పోటీలు నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులు గ్రంథాలయానికి విచ్చేసి వ్రాయించడం, కథలు పుస్తకాలు చదివించారు. ఈకార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు మాచర్ల మెర్సి ఉన్నారు.

జగన్ వీధి నాటకాలు తిప్పికొట్టాలి: బాలాజి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఏపీని అన్ని రంగాల్లో కటిక చీకట్లలోకి నెట్టి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని హతమార్చిన వైసీపీ అధినేత జగన్ ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్నారని, వెన్నుపోటు దినం పేరుతో కొత్త డ్రామాకు తెరతీస్తున్నారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి విమర్శించారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలు ఓటు వేసి గెలిపించిన జూన్ 4వ తేదీ వైసీపీ అధినేత వెన్నుపోటు దినోత్సవంగా పేర్కొంటూ నిరసనలకు పిలుపు నివ్వడం తన ఉనికికి కాపాడుకోవడానికేనని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన వైసీపీ మూకలను రాష్ట్ర ప్రజలు తరిమివేసి ఒక వసంతం పూర్తయిందని బాలాజి చెప్పారు. ఈ శుభ తరుణాన్ని పురస్కరించుకుని పండగ చేసుకుందామని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారని తెలిపారు. జూన్ 4వ తేదీన సంక్రాంతి- దీపావళి పండుగను కలిపి చేసుకుందామని, ఉదయం వాకిళ్లను రంగవల్లులతో అలంకరించి, పీడ విరగడై ఏడాది అయిన సందర్భంగా సాయంత్రం దీపావళి మాదిరిగా దీపాలు వెలిగించి టపాకాయలు కాల్చాలని జనసేన పిలుపునిచ్చిందని వివరించారు. సంక్షేమాభివృద్ధి పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతుగా, వైసీపీ కుటిల రాజకీయాలకు వ్యతిరేకంగా జనసైనికులు, వీర మహిళలు ఈ పండుగను జరుపుకోవాలని బాలాజి కోరారు.

ఏడుకొండలుకు ఘన సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో టైపిస్టు ఎం.ఏడుకొండలు పదవి విరమణ సందర్భంగా సోమవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో ఘన సన్మానం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి ఎం.మహతి మాట్లాడుతూ. కొండలు మృదు స్వభావి అని, అందరినీ ఆప్యాయంగా పలకరించే వారని, మంచి క్రమశిక్షణతో పనిని పూర్తి చేస్తారని తెలిపారు. సీనియర్ టైపిస్టుగా వారి సేవలు మర్చిపోలేనివన్నారు. పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ పదవి విరమణ పొందిన తర్వాత కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని కోరారు. కోర్టులో టైపిస్టుగా పనిచేస్తూ న్యాయవాదులతో కొండలు మంచి అనుబంధం కలిగి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస రావు, సెక్రటరీ పి గౌస్ మొహిద్దీన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ పీ వీ రమణారెడ్డి, ట్రెజరర్ వి శివశంకర్ బాబు, సీనియర్ న్యాయ వాదులు పి జె లూకా, పి సైదారావు, ఎన్ రామ కోటేశ్వర రావు, టి హనుమంతరావు, వై శ్రీనివాసరావు, ఎస్కే సిద్దయ్య, కె చెన్నకేశవరెడ్డి, ఆరే సామ్రాజ్యం, జె తిరుపతిరావు, కే సుందర్ రెడ్డి,టి ఆంజనేయులు బి శ్రీనివాసులు, కే భాను తేజ, జి అనిల్ కుమార్,కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. అనంతరం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక అవసరాలు కల చిన్నారులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర-తెనాలి : ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ బాలబాలికలను గుర్తించి రాబోయే విద్యాసంవత్సరంలో అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుటకు సర్వే చేస్తారని మండల విద్యాశాఖ అధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్‌లో భాగంగా మే 13వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జరుగనున్న సర్వేలో అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాఠశాలల్లో ప్రత్యేక విద్యతో పాటు వైద్య ధృవీకరణ పత్రము, ఇతర రాయితీలు ఉచితంగా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ డి.సునీత, వై.రజని మే 13 నుండి నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా తెనాలి మండలంలో ఇప్పటి వరకు చేసిన సర్వేలో 3,4 సంవత్సరాల వయసు కలిగిన బాలలు 31 మంది దివ్యాంగులుగా గుర్తించారని చెప్పారు. వారిలో కొందరు విద్యాసంబంధమైన అవసరాలు పొందుతున్నారని, మరికొందరు ఎక్కడ నమోదు కాలేదని అన్నారు. బడి ఈడు కలిగిన బాలలందరూ పాఠశాలల్లో నమోదు కావాలని, దివ్యాంగ బాలలు సైతం విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.

అంతర్జాతీయ యోగా మాసోత్సవాలు

విశాలాంధ్ర-తెనాలి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీన జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మే 21 నుండి జూన్ 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో యోగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మంగళవారం నుండి ఈనెల 18వ తేదీ వరకు ఉదయం 7.30 గంటలకు యోగా ట్రైనర్స్‌తో వార్డు పరిధిలో యోగా శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 3 నుండి 5వ తేదీ మరియు 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు, 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు తులసీదాస్ కమ్యూనిటీ హాల్, ఐతానగర్‌లోను, శ్రీరామ కృష్ణ కవి కళాక్షేత్రం, కొత్తపేటలోను, కమ్యూనిటీ హాల్ చినరావూరు, నూకల రామకోటేశ్వరరావు కళ్యాణమండపం, బోస్‌రోడ్డు, డా.పావులూరి కృష్ణచౌదరి కన్వెన్షన్ హాల్, మారీసుపేట, కమ్యూనిటీ హాల్ 30వ వార్డు వాటర్‌ట్యాంక్ ప్రక్కన, పాఠశివాలయం, గంగానమ్మ పేట, ప్రియదర్శిని స్కూల్, బుర్రిపాలెంరోడ్డు నందు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో మ్యాట్రిక్స్ విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో మ్యాట్రిక్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు వివిధ కేటగిరిలలో ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్లు రామిరెడ్డి, ఏడుకొండలు అన్నారు. తమ విద్యార్థులు డి.శివతేజ ఆలిండియా 1179వ ర్యాంకు, కె.పరిమళ సౌమ్య 2682(పి) ర్యాంకు, కె.చరణ్ తేజ 3041 ర్యాంకు, జేవీ హర్షనారాయణ 5051ర్యాంకు, సీహెచ్ హాసిని 5060ర్యాంకు, ఎం.చెర్రీ 5376 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని డైరెక్టర్లు రామిరెడ్డి, ఏడుకొండలు తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల నైపుణ్యం, కళాశాల యాజమాన్యం రూపొందించిన ప్రోగ్రాంల సమిష్టి ఫలితమే కారణమని అన్నారు.

ఒక్క విభజన హామీని అమలు చేయని కేంద్ర ప్రభుత్వం: మేడా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఆంధ్రప్రదేశ్ అశాస్త్రీయంగా విభజన జరిగి నేటికి 11 ఏళ్లు పూర్తి కావొస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్క విభజన హామీని అమలు చేయలేదని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక (ఆర్పీసీ)అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సిగ్గు లేకుండా సభలు, సమావేశాలు పెట్టి భవిష్యత్ విజన్ అని చెప్పుకుంటున్న కార్పొరేట్ చెక్క పార్టీలకు ఎలాగు సిగ్గులేకుండా పోయిందని, విభజన హామీలు అమలు సాధించలేని దద్దమ్మలు ప్రస్తుత ఆంధ్ర కార్పొరేట్ పార్టీల వంతు అయితే తెలంగాణా సాధన ఎవరి కోసమో.. ఎవరు లాభపడటం కోసమో అర్థం కాని దురదృష్టకర ఆవిర్భావం తెలంగాణా రాష్ట్ర సాధనగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దమ్మున్న నేతలు, పాలకులు ఏపీ నుండి పార్లమెంట్‌కు వెళ్లాలని, అప్పుడే సముచిత న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి

విశాలాంధ్ర-తాడికొండ : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సూపర్‌ సిక్స్‌ పథకాలు అమలు జరపాలని కోరుతూ స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సూపర్‌ సిక్స్‌ పథకాలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహశీల్దార్‌ మెహర్‌ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్‌ రావు, రేపూడి శ్రీనివాసరావు, కుర్ర అనిల్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరులో: కూటమి నాయకులు ఎన్నికల ముందు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడికొండ నియోజకవర్గ సీపీఐ నాయకులు కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాలను పేదలకు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయకపోవడం సరైంది కాదన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీతో పాటు పెరిగిన నిర్మాణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించాలన్నారు. సొంత ఇళ్ళు లేక ఇప్పటికీ అనేక పేద కుటుంబాలు అద్దె ఇళ్లలో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే ఆందోళనను ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం తహశీల్దార్‌ జి.సుజాతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుర్రంకొండ సత్యానందం, తోకల అనురాధ, తోకల జయమ్మ, సుజాత సంసోను, ఇమ్మానుయేలు, మేరీ, ఢిల్లీ చిన్ని, రాజేశ్వరి, సరళ, రాములమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో: నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలకు మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని కానీ ఇంతవరకు ఇవ్వలేదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు స్థలం ఇల్లు కట్టుకొనుటకు రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్‌ చేశారు అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తన్నీరు ప్రభుదాస్‌, జిల్లా రైతు నాయకులు జగన్నాథం, ప్రతిపాడు కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు, సహాయ కార్యదర్శి సోమేపల్లి వీరాంజనేయులు, మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, ఏఐటీయూసీ నాయకులు మేడా తాతారావు, సిద్ది రవి, కుంచాల అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో: సీపీఐ రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం పొన్నూరు మండల తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, పల్లెలలో మూడు సెంట్లు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాలలో 2 సెంట్లు, పల్లెలో 3 సెంట్లు ఇవ్వటంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ జీఓ ప్రకారం పొన్నూరు పట్టణంలోని నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం కేటాయించి రూ.5 లక్షలు నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్‌ గౌస్‌, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్‌, షేక్‌ మహమ్మద్‌ అలీ, కోటేశ్వరమ్మ, శారద, వెంకయ్యమ్మ, మహమ్మద్‌, యశోద, మరియమ్మ పాల్గొన్నారు.

పెదకాకానిలో: సీపీఐ రాష్ట్ర పిలుపు మేరకు పెదకాకాని మండల తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెదకాకాని సీపీఐ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్‌ రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, పల్లెలలో మూడు సెంట్లు స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. పెదకాకాని మండలంలోని గ్రామాల్లో నివసించే నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం కేటాయించి రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇచ్చి లబ్దిదారులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్‌ కస్టమర్స్‌ అండ్‌ ఏజెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్‌, మహిళా సమాఖ్య గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెంటాల కుమారి, షేక్‌ బాషీద్‌, ఆర్ల దేవిక తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: తహసీల్దార్‌ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. షేక్‌ కరిముల్లా అధ్యక్షతన యార్లగడ్డ శివయ్య ఆధ్వర్యంలో దుగ్గిరాల తహసీల్దార్‌ ఐ.సునీత కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద ప్రజలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని పార్టీ డిమాండ్‌ చేస్తుందన్నారు. అర్జీలను పరిశీలించి వెంటనే భూసేకరణ చేసి స్థలాలు ఇవ్వాలని పేదలకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నాయకులు కార్యకర్తలు, చిలకమ్మా మస్తానమ్మ కే ముత్తారావు, శంకర్‌, రామచంద్ర రావు, షేక్‌ బేగం, షేక్‌ నుర్జాన్‌, పాములు ఎర్రగడ్డ శంకర్రావు పాల్గొన్నారు.

శావల్యాపురం: మండలంలో అర్హులైన పేదలందరికి మూడు సెంట్లు ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని, ఐరన్‌, సిమెంటు సబ్సిడీలో ఇవ్వాలని, ఇసుక ఉచితంగా ఇవ్వాలని సోమవారం శావల్యాపురం తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి రాయబారం వందనం మాట్లాడుతూ సూపర్‌ సిక్స్‌ అమలు చేయలేని పక్షంలో మండలంలో ప్రజలందరిని ఐక్యం చేసి పెద్ద ఎత్తున సిపిఐ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అనంతరం మండల తహశీల్దారుకు వినతి పత్రం ఇచ్చారు. సీపీఐ నాయకులు జల్లి వెంకటేశ్వర్లు, నక్క శ్రీదేవి, ఆర్‌ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ రూరల్‌: కూటమి ప్రభుత్వం సూపర్‌ సిక్స్‌ పథకాలు వెంటనే అమలు చేయాలని, పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం వినుకొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లో సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్‌, సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, మండల కార్యదర్శి ఏ.పవన్‌, రాయబారం వందనం, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, ఊట్ల రామారావు, కొప్పెరపు మల్లికార్జున, మస్తాన్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాల పంపిణీతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నిబోయిన వెంకటేశ్వర్లు డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లస్థలాలు పంపిణీ కార్యక్రమం తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేస్తూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బొల్లాపల్లి మండల తహశీల్దార్‌ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి షేక్‌ సైదా వలి, రామకోటి, వెంకటేశ్వర్లు, షేక్‌ సుభాని, మరియమ్మ, ఎస్తేర్‌ రాణి, సైదమ్మ, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో: పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం పేదలకు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్‌ చేశారు. అదేవిధంగా ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. సూపర్‌ సిక్స్‌ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకి సీపీఐ సీనియర్‌ నాయకులు ఉప్పలపాటి రంగయ్య అధ్యక్షత వహించగా జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం పేదలకు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అదేవిధంగా ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేయాలని, సూపర్‌ సిక్స్‌ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోయి శీను, విజయ శాలిని, దానేలు, జక్రం దేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో: సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన సూపర్‌ సిక్స్‌ పథకాల హామీలను ఇప్పటికైన అమలు చేయాలని సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, దాచేపల్లి మండల కార్యదర్శి కొమెర వెంకట్రావు, పార్టీ సీనియర్‌ నాయకులు తెలనాకుల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు దాచేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. తొలుత నారాయణపురంలోని పార్టీ కార్యాలయం నుంచి తహశీల్దార్‌ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్ళి అక్కడ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున నిరుపేదలకు ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలని, అందులో ఇళ్ళ నిర్మాణానికి గాను ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేయాలని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. అదేవిధంగా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో నివశిస్తున్న సీపీఐ కాలనీ వాసులకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌ రాజాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పత్తిపాటి నాగరాజు, రామయ్య, ఈసూప్‌ బేగ్‌, గంగారం మీరావలీ, నేరెళ్ల కొండలు, సుభానీ, నాసరయ్య, ఏసోబు, గుండ్రెడ్డి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: అర్హులైన నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలంటూ సోమవారం సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన సూపర్‌ సిక్స్‌ పథకాలను, హామీలను అమలు చేయాలని, అర్హులైన నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలని అన్నారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌ బి.నిర్మలకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జమ్ములమూడి వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్‌ నాయకులు తానం మత్తయ్య, సిపిఐ మండల నాయకులు పిడెం హుస్సేన్‌, ముప్పూరి మధుసూదనరావు, తన్నీరు కోటయ్య, వెన్నా గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు: సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ స్థానిక తాసిల్దార్‌ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి, సీనియర్‌ నాయకులు ఊట్ల రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేసి ,సొంతింటి కళ ను నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. అనంతరం తహశీల్దార్‌ నళినికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు సానుభూతిపరులు, మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

మంగళవారం 3 జూన్, 2025

పర్యావరణానికి ప్లాస్టిక్ హానికరం

విశాలాంధ్ర-రెంటచింతల : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుదాం-ప్లాస్టిక్ వాడకాన్ని మానివేద్దాం అనే కార్యక్రమంపై పరాశక్తి సిమెంట్స్ కర్మాగార వర్కర్స్ హెడ్ ఎంఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్లాస్టిక్ నివారణ చర్యలు ముందుగా మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. దీనికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని, ప్రకృతితో మమేకమై అందరూ ఆహ్లాదకర వాతావరణంలో జీవించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. కర్మాగారపు పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వేస్ట్ తొలగింపులతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్లు ఎం.రామకృష్ణారెడ్డి, సి.చంద్రశేఖర్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య ప్రభంజనం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆల్ఇండియా జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలలో ఆల్ఇండియా కేటగిరిలో 1, 3, 5, 6, 11 ర్యాంకులు వచ్చాయని అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ తెలిపారు. గుంటూరు జోన్ నుంచి అన్ని కేటగిరిలో కలిపి ఎన్.హేమంత్ అభిరామ్ 48వ ర్యాంకు, బి.రుద్రతేజ 309వ ర్యాంకు, బి.రాజునాయక్ 378వ ర్యాంకు, జి.వైష్ణవి 405వ ర్యాంకు, కె.హర్షవర్ధన్ 414వ ర్యాంకు, ఎండీ తాబిష్ అయిమన్ 674వ ర్యాంకులతో పాటుగా 1000 లోపు 21 మంది, 2000 లోపు 34 మంది, 5000 లోపు 66 మంది, 10000 లోపు 127 మంది ర్యాంకులు సాధించారని చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్స్ సురేష్, చంద్రశేఖర్, కృష్ణ అసోసియేట్ డీన్ హరిబాబు, ఏజీఎం ఎల్టీసీ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పేదలకు నివేశన స్థలాలు అందేవరకూ సీపీఐ పోరు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అర్హులైన పేదవారికి నివేశన స్థలాలు అందే వరకు సీపీఐ అండగా నిలుస్తోందని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు అన్నారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నివేశన స్థలాలు ఇస్తామని ప్రకటించిందని అయితే లబ్ధిదారుల ఎంపిక, నివేశన స్థలాల కోసం స్థల సేకరణ తదితర అంశాలపై ఇంతవరకు కార్యాచరణ ప్రకటించలేదన్నారు. సీఎం చంద్రబాబు పేదలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3సెంట్లు స్థలాలు ఇవ్వాలని, ఇందుకు సంబంధించి కార్యాచరణ వేగవంతం చేయాలన్నారు. చాలిచాలనీ ఆదాయంతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారాయని, ఇటువంటి తరుణంలో ఇంటి అద్దెలు చెల్లించటం పేదలకు మరింత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరల దృష్ట్యా పేదల గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని విమర్శించారు. పేదల పక్షాన వారి సమస్యలపై పోరాడటానికి సీపీఐ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, నాయకులు మల్లికార్జున్, రాము, నవీన్, అంజయ్య, చౌటపల్లి నాగేశ్వరరావు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలోని నిరుపేదలకు సొంత ఇంటి కల వెంటనే నెరవేర్చాలని సీపీఐ వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు అన్ని పట్టణ మండల కేంద్రాలలో తలపెట్టిన ఇళ్లస్థలాల కొరకై వినుకొండ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వం పట్టణాల్లో ఇచ్చిన సెంటు భూమిని పక్కా గృహం నిర్మించుకొనుటకు ఆ ప్రభుత్వం గ్రాంట్ చేసిన 1,80,000 రుణం సరిపోదని కూటమి ప్రభుత్వం అధికారంలోకివస్తే రెండు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని అందులో పక్కా గృహం నిర్మించుకునేందుకు నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి ఉన్నారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం కావస్తున్న ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. కావున అర్హులైన వారందరికీ ఇంటి స్థలము రెండు సెంట్లు ఇచ్చి పక్కా గృహం నిర్మించుకొనుటకు ఐదు లక్షలు రూపాయలు ఇవ్వాలని ఆయన కోరారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పటాన్ లాల్‌ఖాన్, పొట్లూరి వెంకటేశ్వర్లు, షేక్ నాగూర్, తోట నరసింహారావు, అల్లా బక్షు, షేక్ చిన్న సైదా, టంగుటూరి సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, ఎంగల బ్రహ్మం, చిన్న వెంకటేశ్వర్లు, షేక్ ఫాతిమ, మున్ని, అఫ్రీం, షైదాబి, గౌసియా, రజియా, సుల్తానా, మహబ్బి, కరిమున్ పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ సురేష్ నాయక్‌కు వినతిపత్రాన్ని వ్యక్తిగత అర్జీలను సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పది రోజుల్లో ఎంక్వైరీ చేయించి లబ్ధిదారులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

'అమలు కాని విభజన హామీలు'పై నేడు రౌండ్ టేబుల్

హాజరు కానున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు గుంటూరు రామన్నపేటలో ఉన్న జనచైతన్య వేదిక హాలులో 'అమలు కాని విభజన హామీలు-యువత వలసలు-అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్' అనే అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం కార్యదర్శి అవధానుల హరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్.తులసి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డితో పాటు వివిధ ప్రజా సంఘాల నేతలు, మేధావులు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే అభ్యుదయ కాముకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నాగ శ్యామలరావుకు సత్కారం

విశాలాంధ్ర-మంగళగిరి : విద్యార్థులకు, ఔత్సాహికులకు ధ్యాన తరగతులు నిర్వహించడంతో పాటు ధ్యానం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్య పరిరక్షణకై అవగాహన కలిగించేలా సేవా కార్యక్రమాల విభాగంలో భాగంగా ఈ సంవత్సరం మే 3వ తేదీన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీచే కన్యాకుమారిలో మంగళగిరి సీకే జూనియర్ కళాశాలలో 34 సంవత్సరాలు అధ్యాపకులుగా సేవలందించిన కొసనం కోటనాగశ్యామలరావు డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా సోమవారం కొసనం కోటనాగశ్యామలరావు, విజయలక్ష్మి దంపతుల 43వ పెళ్ళిరోజును పురస్కరించుకుని రామనాథం చిన్నకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆశ్రమ అధ్యక్షులు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దత్తాశ్రమం పీఠాధిపతి పోలంకి చిన్నుబ్బారావు, దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బల్లా వెంకటరమణ, అల్లక తాతారావు, యునెస్కో క్లబ్ దక్షిణ భారత ప్రాంతం ఇన్‌చార్జ్ రామనాథం పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మలేరియా మాసంగా పాటించి మలేరియా నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ)డాక్టర్ కె.విజయలక్ష్మీ అన్నారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం నందు డిఎంహెచ్ఓ డాక్టర్ కె. విజయలక్ష్మి అధ్యక్షతన ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మలేరియాపై అవగాహన కల్పించే నిమిత్తం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర నుండి బృందావన్ గార్డెన్స్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ మలేరియా నివారణ చర్యలైన దోమకాటును నివారించుట.. సాయంత్రం వేప పొగ వేయుట..నీటి నిల్వలు లేకుండా చేసుకొనుట.. దోమతెరలు వాడుట..పరిసరాల పరిశుభ్రత..ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించుట..దోమల లార్వాలు, అడల్ట్ మస్కిటో చర్యలపై జూన్ నెల మొత్తం ప్రజలకు అవగాహన కల్పించడంతోనే మలేరియా నివారణ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్రబాబు, ఆరోగ్య విస్తరణ అధికారి గణేష్, డిప్యూటీ డెమో ఎన్.వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్, హెల్త్ సూపర్ వైజర్లు, స్త్రీ పురుష ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు జరపాలి

విశాలాంధ్ర-పెదనందిపాడు : రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును తక్షణమే కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించి తహశీల్దార్ బి.వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి పొగాకు కొనుగోళ్ళు జరపకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, స్థానిక రైతు సంఘం నాయకులు పాల్గొని ప్రసంగించారు.

విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు కృష్ణాజిల్లాలో దిగువ పేర్కొన్న మండలాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను

ఇంటర్మీడియట్ చదివి తెలుగు భాషా పరిజ్ఞానం కలిగి సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న అభ్యర్థులు అర్హులు

పనిచేయవలసిన మండలాలు :

మచిలీపట్నం టౌన్, బాపులపాడు, కోడూరు, గూడూరు, నాగాయలంక, నందివాడ, తోట్లవల్లూరు, ఉంగుటూరు, హనుమాన్ జంక్షన్

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ : 8074662146, 9490338489

గమనిక : ఆయా ప్రదేశాలల్లో స్థానికులై ఉండాలి

విశాలాంధ్ర జిల్లా కార్యాలయం

ఈడేపల్లి, ఆంజనేయస్వామి గుడి ఎదుట, మచిలీపట్నం

ఎస్సీ వర్గీకరణ అన్ని ప్రభుత్వ రంగాల్లో అమలు చేయాలి: డొక్కా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎస్సీ వర్గీకరణ అన్ని ప్రభుత్వ రంగాల్లో అమలు చేయాలని మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో డొక్కా మాణిక్యవర ప్రసాద్ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని జేసీకి వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాల తరువాత ఎస్సీ వర్గీకరణ ఏర్పడిందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపారని, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా రాష్ట్ర ఎస్సీ ప్రజలకు జనాభా ప్రతిపాదికన వారికి రావలసిన రిజర్వేషన్లు వారికి అందుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రీవెన్స్‌లో ఎస్సీ వర్గీకరణపై అర్జీలు ఇచ్చినట్లు చెప్పాం. ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వ ఉద్యోగాలు, పదోన్నతులు, వివిధ విద్యా సంస్థల ప్రవేశాలలో, ప్రభుత్వం అన్ని రంగాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని జేసీని కోరినట్లు తెలిపారు. ఇది భారత రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చేయబడాలన్నారు. ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థల నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలని, పదోన్నతులు విషయంలో రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మాదిగ జన సేవా సమితి నాయకులు చావలి బాలస్వామి, అత్తోట జోసఫ్ కుమార్, కొండముది భగవాన్ దాస్, దాసరి జాన్‌బాబు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెబ్‌బైల్ యాప్స్, కెఎల్ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఏఐ అవగాహనతో మారడానికి “ఇండస్ట్రీ ఆన్ క్యాంపస్

విశాలాంధ్ర విజయవాడ ఎడ్యుకేషన్ : వెబ్‌బైల్ యాప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయం (డీమ్డ్ టు బి) తో వ్యూహాత్మక భాగస్వామ్యంలో “ఇండస్ట్రీ ఆన్ క్యాంపస్” చొరవను సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఇది డిజిటల్ కృత్రిమ మేధస్సు సామర్థ్యాలను క్యాంపస్ లోని విద్యార్థుల విద్యా అభ్యాసంలో నేరుగా అనుసంధానిస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా, విజయవాడలో సెంటర్ ఫర్ డిజిటల్ ఏ ఐ ఎక్సలెన్స్ స్థాపించబడుతుందన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో, ఈ సహకారం 1,000 కంటే ఎక్కువ హై-స్కిల్ ఇంజనీరింగ్ స్థానాలను సృష్టించాలని అంచనా వేయబడిందన్నారు. ఈ ప్రాంతానికి ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుందని, భారతదేశం యొక్క వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ప్రతిభ

పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. విద్యాభ్యాసం పరిశ్రమ డిమాండ్ల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈ చొరవ ఒక ముందడుగు వర్ణించారు. ఈ నెల 30 న విజయవాడలో జరిగిన ‘ఇండస్ట్రీ ఆన్ క్యాంపస్’ చొరవ ప్రారంభంలో కేఫిన్ టెక్నాలజీస్, వెబ్ ఆప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కేఎల్ విశ్వవిద్యాలయం నుండి నాయకత్వ బృందాలు, కీలక వాటాదారులతో కలిసి పాల్గొన్నాయన్నారు. వెబ్‌బైల్ యాప్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నజీష్ హుస్సేన్ మీర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో శాశ్వత ప్రభావాన్ని సృష్టించడానికి విద్యాసంస్థ, పరిశ్రమ మరియు ఆవిష్కరణలు కలిసి రావడాన్ని చూడటం చాలా అర్థవంతంగా ఉందన్నారు. “ఈ చొరవ సహకార ఆవిష్కరణ శక్తిపై మా నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. అట్టడుగు స్థాయిలో ప్రతిభ అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడం ద్వారా, మేము భారతదేశ సాంకేతిక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా పోటీ పడటానికి అవసరమైన నైపుణ్యాలతో మా భవిష్యత్ శ్రామిక శక్తి సన్నద్ధమైందని కూడా నిర్ధారిస్తున్నామన్నారు. కె ఎల్ విశ్వవిద్యాలయంతో ఈ భాగస్వామ్యం అన్ని వాటాదారులకు స్థిరమైన, దీర్ఘకాలిక విలువను నిర్మించడానికి మా నిబద్ధతకు నిదర్శనమన్నారు.

ఐ.ఐ.టి ఆడ్వాన్స్‌డ్ ఫలితాలలో విశ్వభారతీ విద్యార్థికి ఆలిండియా 2వ ర్యాంక్

విశాలాంధ్ర-గుడివాడ : ఐఐటి ఆడ్వాన్స్‌డ్ - 2025 ఫలితాలలో విశ్వభారతీ పూర్వ విద్యార్థికి ఆలిండియా 2వ ర్యాంక్ రావడం అభినందనీయమాని విశ్వభారతి ఇంగ్లీషు మీడియం స్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం స్థానిక విశ్వభారతీ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో డైరెక్టర్ ఆర్.మంజులతో కలసి అయన మాట్లాడుతూ ఐఐటి అడ్వాన్స్‌డ్ ఫలితాలలో 100లోపు 7 జాతీయస్థాయిలో ర్యాంక్ సాధించి, 1000లోపులో 29 మంది విద్యార్థులు ఆలిండియా ర్యాంక్‌లు సాధించడం గొప్ప విషయమన్నారు. పూర్వ విద్యార్థి పల్లా భరత్‌చంద్ర ఒబిసి కేటగిరిలో ఆలిండియాలో 2వ ర్యాంక్, ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 21వ ర్యాంక్ సంచలం విజయం సాధించడం జరిగిందన్నారు. కె.ప్రణయ్ ఆలిండియా 23 ర్యాంక్, బి.చాణుక్య, 78వ ర్యాంక్, డి.బలరామ్‌నాయుడు 98వ ర్యాంక్‌తో విజయం సాధించడం జరిగిందన్నారు. ఇంతటి ఘనం సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అయన అభినందించారు.

కూచిపూడిలో గణనాథుని కళ్యాణం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడి అగ్రహారంలో పసుమర్తి వారి బజారు(రెండవ వార్డ్)లో సోమవారం సిద్ధి, బుద్ధి, సమేత శ్రీ విఘ్నేశ్వరుని కళ్యాణ వేడుకలు మంగళవాయిద్యాలహోరులో పూజారుల వేదమంత్రాలు నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరం వేంకటేశ్వరఫణికుమార్ పర్యవేక్షణలో భాగవతుల నాగమణి ఆధ్వర్యంలో ఈ కళ్యాణ వేడుకలు శాస్త్ర యుక్తంగా జరిగాయి. ఈ వేడుకలను విశ్రాంతి మెడికల్ ఉద్యోగి సోమయాజుల మురళీకృష్ణ కనకదుర్గ దంపతులు నిర్వహించగా శ్రీ సిద్ధ యోగి నాట్య కళా పీఠం ప్రధానాచార్యులు(పూర్తి అదనపు బాధ్యతలు) డాక్టర్ ఎం శ్రీనివాసరావు (శ్రీశైలం ప్రాజెక్టు) ఈ వేడుకలో అలాగేకూచిపూడిపెదపూడి గ్రామానికి చెందిన పలువురు భక్తులు హాజరైనారు.

సాంకేతికతతో రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలి : శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర-నందిగామ:- వికసిత్ కృషి సంకల్ప యాత్రలో భాగంగా 5వ రోజు నందిగామ మండలం సోమవారం గొల్లమూడి గ్రామాలను వికసిత్ కృషి సంకల్పయాత్రను డాక్టర్ కే ఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రము గరికపాడు జాతీయ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు అందిస్తూ రానున్న ఖరీఫ్ పంటల సాగు పద్ధతుల గురించి రైతులకు వివరించారు రైతులకు ఖర్చుల భారం తగ్గించుకొని యాంత్రిక పద్ధతిలో వ్యవసాయం నిర్వహించాలని సూచించారు ఈ కార్యక్రమాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగ్ చౌహాన్ ప్రారంభించబడిందని తెలియజేశారు సాంకేతికపై రైతులు అవగాహన పొంది వ్యవసాయ ఖర్చులను తగ్గించుకొని లాభసాటి గా వ్యవసాయాన్ని మార్చుకోవాలని సూచనలు అందించారు విత్తన ఉత్పత్తి ఎరువుల వినియోగం తెగుళ్ల యాజమాన్యం గురించి పలు వంశాలపై రైతులకు శాస్త్రవేత్తలు సూచనలు అందించడం వారితో చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో జాతీయ వాణిజ్య పంటల పరిశోధన స్థానం రాజమండ్రి శాస్త్రవేత్తలు డాక్టర్ బి రాజశేఖర్ రెడ్డి,డాక్టర్ జై రాజప్ప,వ్యవసాయ పరిశోధన కేంద్రం గరికపాడు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం కృష్ణంరాజు,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వెంకటరెడ్డి,ఎన్ రాజశేఖర్ స్థానిక వ్యవసాయ అధికారి ఖాసిం సచివాలయ సిబ్బంది గ్రామ రైతులు విరివిగా పాల్గొన్నారు.

హైదరాబాద్, బెంగళూరులో శామ్‌సంగ్ ‘సాల్వ్ ఫర్ టుమారో’

విశాలాంధ్ర- గుంటూరు: శామ్‌సంగ్ ‘సాల్వ్ ఫర్ టుమారో’ సీజన్ 4 దక్షిణ భారతదేశానికి విస్తరించింది. ఈ కార్యక్రమం యువత ఆధారిత ఆవిష్కరణలకు దోహదపడుతూ, సామాజిక ప్రభావాన్ని కలిగించే పరిష్కారాలను ప్రోత్సహిస్తోంది. హైదరాబాద్‌లోని ప్రగతిశీల విద్యాసంస్థల్లో, బెంగళూరులోని ప్రముఖ టెక్నాలజీ కేంద్రాల్లో విద్యార్థులు సానుభూతి, ప్రయోజనం, డిజైన్ థింకింగ్ సూత్రాల ఆధారంగా స్థానిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు ముందుకొస్తున్నారు. సాల్వ్ ఫర్ టుమారో భారతదేశం అంతటా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నందున, ఇది తన పరిధిని విస్తరించడమే కాదు.. కొత్త అవకాశాలను అన్లాక్ చేస్తోంది. హైదరాబాద్ నుండి బెంగళూరు వరకు.. త్వరలో ఈశాన్య ప్రాంతాలకు ఈ కార్యక్రమం విద్యార్థుల నేతృత్వంలోని ఆవిష్కరణలతో కూడిన భవిష్యత్తును పెంపొందిస్తోంది.

పత్తి సాగు కోసం పురుగుమందు జివోరాను ఆవిష్కరించిన క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్

విశాలాంధ్ర-గుంటూరు: తన పురుగుమందుల పోర్ట్‌ఫోలియోను విస్తరించడంపై తదేక దృష్టితో, భారతదేశంలోని ప్రముఖ వ్యవసాయ రసాయన ఉత్పత్తుల సంస్థ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ (సీసీపీఎల్), ఒక ప్రధాన పరిశోధన ఆధారిత పురుగుమందు రకాన్ని ఆవిష్కరించినట్లు ప్రకటించింది. భారతదేశ పంట సంరక్షణ మార్కెట్ సీఏజీఆర్ 4.35 శాతంతో, 2025లో 2.59 బిలియన్ డాలర్ల నుండి 2030 నాటికి 3.21 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేయబడిన సమయంలో ఈ ఆవిష్కరణ చోటు చేసుకుంది. ఈ విభాగంలో తన వృద్ధిని మరింతగా పెంచుకోవడానికి, మార్కెట్ లీడర్‌గా తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి సీసీపీఎల్ తదుపరి తరం పురుగుమందు జివోరాను ఆవిష్కరించింది, ఇది పత్తిలో రసం పీల్చే తెగుళ్ల వల్ల పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి రూపొందించబడింది.

ఎన్‌ఈపీ 2020 లక్ష్యాలను సాధించేలా యూనివర్సిటీలకు ఎన్ఐఏటీ చేయూత

విశాలాంధ్ర- గుంటూరు: నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) 2020 మార్గదర్శకత్వంలో భారతదేశ విద్యా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మార్పులో యూజీసీ, ఏఐసీటీఈ సంస్థలు విద్యను నైపుణ్యానికి పెద్దపీట వేసేలా మార్చేందుకు ఎంతగానో కృషి చేస్తూ అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ ఆశయాన్ని వేగంగా ముందుకు తీసుకు వెళ్లడానికి నెక్ట్‌వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ (ఎన్ఐఏటీ) ప్రారంభించిన యూనివర్సిటీ భాగస్వామ్య మోడల్ ను భారతదేశంలోని పలు యూజీసీ అప్రూవ్డ్ యూనివర్సిటీలు అమలు పరుస్తున్నాయి. నైపుణ్య ఆధారిత విద్యకు దేశవ్యాప్తంగా అనుకరించదగినదిగా ఈ మోడల్ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థులకు చక్కటి కెరియర్ ఫలితాలు తీసుకువచ్చేలా యూనివర్సిటీలను బలపరచడమే ఈ భాగస్వామ్యం యొక్క లక్ష్యమని నెక్ట్‌వేవ్, ఎన్ఐఏటీ కో ఫౌండర్ మరియు సీఈవో రాహుల్ అత్తులూరి అన్నారు. ‘ఒక వైపు యూనివర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్‌ను తమదైన విధంగా కొనసాగిస్తుంది. మరో వైపు విద్యార్థులు ఇండస్ట్రీకి సిద్ధమవ్వడానికి అవసరమైన ప్రతిదీ హ్యాండ్స్-ఆన్ స్కిల్ ట్రైనింగ్, ఇండస్ట్రీ ప్రాక్టీషనర్ల నుంచి సెషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, ఇంటర్న్షిప్స్, ప్లేస్మెంట్స్ ఇలా కావలసిన అన్నింటిలో ఎన్ఐఏటీ తోడ్పాటునందిస్తుంది’ అని ఆయన తెలిపారు.

ప్లాటినం లవ్ బ్యాండ్స్ ది వెడ్డింగ్ ఎడిషన్ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ : వేసవి వివాహాల సీజన్ కొనసాగుతున్న తరుణంలో ది వెడ్డింగ్ ఎడిషన్‌ను ప్లాటినం లవ్ బ్యాండ్స్ ఆవిష్కరించింది. ఇవి జీవితంలో ఒక్కసారి వచ్చే ప్రేమకథకు గుర్తుగా రూపొందించబడిన కపుల్ బ్యాండ్స్. ఎంతో ఆలోచనాత్మకంగా రూపొందిన బాండ్స్ కలెక్షన్ ఇది. నిజమైన నిబద్ధత భావోద్వేగ స్పష్టత నుండి వస్తుందనే భావనతో నిండి ఉండే ఈ ప్లాటినం బ్యాండ్స్ సాధారణ చిహ్నాల కంటే ఎక్కువ. 95% స్వచ్ఛమైన ప్లాటినంతో రూపొందించబడిన వీటి ధరలు రూ 60వేలు నుండి ప్రారంభమతాయని నిర్వహకులు తెలిపారు.

హ్యాపీడెంట్ ‘చమ్ కింగ్ గుమ్: చమ్ కా ముస్కాన్, జగ్ మగ్ జహాన్’ క్యాంపెయిన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): : పెర్ఫెట్టీ వాన్ మెల్ ఇండియా కుటుంబానికి చెందిన చ్యూయింగ్ గమ్ లలో ఒకటైన హ్యాపీడెంట్ ఒక సరికొత్త యాడ్ ఫిల్మ్ ను విడుదల చేసింది. ఈ కొత్త క్యాంపెయిన్ ‘చమ్ కింగ్ గమ్: చమ్కా ముస్కాన్, జగమగ్ జహాన్’, కాంతులు చిమ్మే చిరునవ్వులో మహిమను, కల్పనా శక్తికి స్ఫూర్తినిచ్చే దానిలోని శక్తిని, కళ్ళను ఆకట్టుకునే ఒక గొప్ప కథా ప్రపంచానికి ప్రేక్షకులను ఆకట్టుకునే ఒక తాజా, సినిమా తరహా లెన్స్ తో బ్రాండ్ తన చారిత్రాత్మకమైన స్టోరీ టెల్లింగ్ (కథను చెప్పే) శక్తిని పునరుత్తేజింపజేసుకుంది. మెక్ కాన్ వరల్డ్ గ్రూప్ ఇండియా వారు ఇతివృత్తం కూర్చిన ఈ క్యాంపెయిన్ కు ప్రఖ్యాత క్రియేటివ్ లీడర్ ప్రసూన్ జోషి నేతృత్వం వహించారు. బాలీవుడ్ లో ప్రఖ్యాతిగాంచిన సంగీతకారుడు, శాంతనూ మొయిత్రా దీనిని స్వరపరిచారు.

రోగనిరోధక శక్తిని సహజసిద్ధంగా పెంచే ఆహారాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బాదం, పసుపు, అల్లం వంటి పోషకాలు అధికంగా ఉండే సూపర్ ఫుడ్‌లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవటంతో పాటుగా కోవిడ్ వంటి విపత్కర సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో గణనీయంగా సహాయపడుతుందని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ సూచిస్తున్నారు. కాలిఫోర్నియా బాదం, పసుపు, అల్లం, వెల్లుల్లి, సిట్రస్ పండ్లు, బొప్పాయి రోగనిరోధక శక్తిని పెంచే సూపర్ ఫుడ్‌లుగా డాక్టర్ రోహిణి సిఫార్సు చేస్తున్నారు. కాలానుగుణ ఆరోగ్య సమస్యల నుండి రక్షణ కల్పించడానికి, మొత్తం శ్రేయస్సును కాపాడుకోవడానికి ఫ్లూ సీజన్‌లో బాదం వంటి ఈ సూపర్ ఫుడ్‌లను ఆహారంలో చేర్చుకోవాలని డాక్టర్ పాటిల్ సూచించారు.

రూ. 2525 కోట్ల పెట్టుబడితో గోపన్‌పల్లి అపర్ణ మూన్‌స్టోన్ లగ్జరీ హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్‌లలో ఒకటైన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ గోపన్‌పల్లి-గచ్చిబౌలి రహదారి వద్ద ఉన్న దాని ప్రతిష్టాత్మక ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ అయిన అపర్ణ దక్కన్ టౌన్‌లో ప్రీమియం రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ అపర్ణ మూన్‌స్టోన్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. రూ. 2525 కోట్ల పెట్టుబడి అంచనాతో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్, హైదరాబాద్ యొక్క అభివృద్ధి చెందుతున్న నగర జనాభాకు అనుగుణంగా అత్యాధునిక, పర్యావరణ అనుకూల, విలాసవంతమైన జీవన శైలి అనుభవాలను అందించడంలో కంపెనీ యొక్క అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతుంది. అపర్ణ మూన్‌స్టోన్ అనేది ఆలోచనాత్మకంగా రూపొందించబడిన గేటెడ్ కమ్యూనిటీ. ఇది జి ప్లస్ 44 అంతస్తులతో ఎనిమిది సొగసైన హై-రైజ్ టవర్‌లను కలిగి ఉంటుంది. మొత్తం 2088 విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌లను అందిస్తుంది. 22.28 ఎకరాల లో విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో 2166 నుండి 3140 చదరపు అడుగుల వరకు విశాలమైన నివాసాలు ఉంటాయి. సౌకర్యం, అధునాతనత రెండింటినీ కోరుకునే సమకాలీన గృహ యజమానుల ఆకాంక్షలను తీర్చడానికి ఇవి రూపొందించబడ్డాయని అపర్ణ కన్స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ఎండి ఎస్ఎస్ రెడ్డి వెల్లడించారు.